క్లుప్తంగా

బాల్య వివాహం నేరం

శాయంపేట : మండలంలోని సాధనపల్లి సమీపంలోని గొల్లపల్లి గ్రామంలో ఈనెల 8వ తేదీన మైనర్ బాలికకు తల్లిదండ్రులు వివాహం జరిపించేందుకు సిద్ధమవుతున్నారనే సమాచారం అందుకున్న సంబంధిత శాఖ అధికారులు వారి ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో చుట్టుపక్కల వారిని విచారించి మైనర్ బాలికలకు వివాహం జరిపించడం చట్టరీత్యా నేరమని, వివాహం చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని స్థానికులను కోరారు.

నిర్వాసితులను ఆదుకోవాలి

నడికూడ : మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనుల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు కోరారు. గత బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి 66 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తే 10 మంది నిర్మించుకున్నారని, మిగత వారికి కూడా ప్రస్తుత ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మంజూరు చేయాలి కోరారు.

విద్యార్థిని సన్మానించిన ఎస్సై



వేలేరు : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన గురుకుల పాఠశాల విద్యార్థి కొంగొండ భరత్ కుమార్‌ను వేలేరు ఎస్సై అజ్మీరా సురేశ్ శుక్రవారం శాలువాతో సన్మానించి అభినందించారు. ఏఎస్సై కిషన్, కానిస్టేబుల్ సుందర్‌రాజ్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

పరకాల : పట్టణంలోని ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో మృతిచెందిన యువకుడు బొచ్చు విక్రమ్ మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ సమన్వయ కమిటీ సభ్యుడు సోదా రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ ఏకు రాజు శుక్రవారం నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

పరకాల : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకుండా వారి జీవితాలతో ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు చెలగాటం ఆడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించకపోవడం, ప్రైవేటు విద్యా సంస్థలు పరీక్షలు నిర్వహించవద్దని కోరగానే యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం విడ్డూరమన్నారు. తక్షణమే యూనివర్సిటీ అధికారులు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చలు జరిపి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో రైలు కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో నాల్గోవ అప్ మెయిన్ లైన్ ట్రాక్‌పై విశాఖపట్నం నుంచి గాంధీ ధామ్ వెళ్తున్న 20803 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు కింద గుర్తు తెలియని వ్యక్తి (45) శుక్రవారం తెల్లవారుజామున తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి ఎడమ చేతిపై లాలా అనే పచ్చబొట్టు ఉందని, మృతుడు నలుపు, ఆకుపచ్చ చిన్న గళ్లల షర్టు, నలుపు ప్యాంటు ధరించి ఉన్నాడని, అతడి వద్ద అడ్రస్ వివరాలు ఏమీ దొరకలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని, అతడి ఆచూకీ తెలిసిన వారు 9247800433 నంబరును సంప్రదించాలని సూచించారు.

ధ్యానం, యోగాతో మానసిక ప్రశాంతత

మామునూరు: ధ్యానం, యోగాతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని, విధి నిర్వహణలో ఉన్న ప్రతీ పోలీసు ఒత్తిడికి లోనుకాకుండా ధ్యానం, యోగా చేయాలని పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ సూచించారు. మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో శివనగర్ ప్రజాపతి బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో పోలీసులకు మానసిక ప్రశాంతతపై శుక్రవారం అవగాహన కల్పించి ప్రజాపిత బ్రహ్మకుమారికి ప్రిన్సిపాల్ పూజ మెమోంటో అందజేశారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

- వరి, మక్క కొయ్యలను కాల్చొద్దని వ్యవసాయశాఖ సూచన
- వేస్ట్ డీ కంపోజర్‌ను వినియోగించాలి
- ముందస్తు ప్రణాళికలతో అధిక దిగుబడి సాధించవచ్చంటున్న ఏఓ



పొలంలో దున్నుతున్న ట్రాక్టర్

ఐనవోలు : యాసంగి పంటలు చేతికి వస్తున్నాయి. వేసవికాలం మొదలుకాగా రైతులు దుక్కిదున్నడం, గతేడాదికి సంబంధించిన పంట అవశేషాలను, చెత్తను కాల్చివేయడం వంటి పనుల్లో నిమగ్నమవుతున్నారు. అయితే జూన్‌లో తొలకరి జల్లు కురియగానే విత్తనాలు విత్తేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితేనే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

కొయ్యలను కాల్చొద్దు

వరి, మక్క తదితర పంటలు సాగుచేసే రైతులు కోత తరువాత గడ్డి, సొప్ప తదితర అవశేషాలను కాలబెట్టవద్దని, ఇలా కాలబెడితే పర్యావరణ ముప్పునకు దారితీస్తుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. వ్యర్థాలను కాల్చడం వలన పోషకాలు నాశనమై భూసారం తగ్గిపోతుందని, నేలలో సేంద్రియ పదార్థం తగ్గడమే కాకుండా కాల్చడం వలన ఉత్పన్నమైన వేడి వలన భూసారం పెంపునకు దోహదం చేసే బ్యాక్టీరియా, శిలీంద్రాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని హెచ్చరిస్తున్నారు. వాతావరణ కాలుష్యం అధికమై రైతులకు ఆరోగ్య సమస్యలు వస్తాయని అంటున్నారు. గడ్డి, ఇతరత్రా అవశేషాలను భూమిలో కలియదున్నడానికి రోటావేటర్‌ను వినియోగించాలని తెలిపారు. గడ్డి అవసరం లేనపుడు వేస్ట్ డీ కంపోజర్ ద్రవాన్ని వినియోగించి భూమిలో ఉంచాలని, ఇలా ఉంచడం వలన సేంద్రియ కర్బనం తయారై నేల సంరక్షణకు దోహదం చేస్తుందని సూచిస్తున్నారు.

వేసవి దుక్కుల ప్రయోజనాలు..

వేసవి దుక్కులు దున్నడం వలన పొలాలకు అనేక



పంట అవశేషాలను కాలుస్తున్న రైతులు


ప్రయోజనాలు కలుగుతాయి. దుక్కులు భూమిని సారవంతం చేస్తాయి. తర్వాతి పంటకు కావాల్సిన పోషకాలు అందుబాటులోకి వస్తాయి. దున్నడం వలన భూమిలో ఉండే వివిధ రకాల పురుగుల గుడ్లు, ప్యూపాలు చనిపోతాయి. అదే విధంగా కలుపు మొక్కల చనిపోవడంతో ప్రధాన పంట వేసినపుడు కలుపు తీవ్రత తగ్గడమే గాక పోషకాలన్ని ప్రధాన పంటకు సమృద్ధిగా లభించే అవకాశాలు ఉంటాయి. వర్షం కురిసినపుడు భూమిలోకి నీరు ఇంకుతుంది. అలాగే నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. దుక్కులు దున్నే ముందు సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా భూమి సారవంతం అవుతుంది.

భూసార పరీక్షలు చేయించాలి

భూమిలో సారం ఎంత ఉంది. ఏ భూమిలో ఏ పంట వేయాలి..? అని నిర్ధారించుకోవడానికి భూసార పరీక్షలు ఉపయోగపడుతాయి. భూసార పరీక్షల కోసం మట్టిని సరైన పద్ధతిలో సేకరించాలి. సేకరించిన మట్టిని ల్యాబ్‌కు పంపించి అందులో ఏ పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవాలి. తద్వారా ఏ భూమిలో ఏ పంట సాగుచేయాలి, ఎంత ఎరువులు వాడాలి, ఏ సమయంలో వాడాలో తెలుస్తోందని సూచిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తాం

పంటసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తాం. త్వరలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు గ్రామపంచాయతీల వారిగా రైతులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నాం. ఆధునిక పద్ధతులు పాటించడం, విత్తనాల ఎంపిక, పురుగు మందుల వాడకం తగ్గించడం, పచ్చిరొట్ట పంటల సాగు, ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తాం.



- సునీల్‌కుమార్, ఏఓ

పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : పద్మశాలీల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం(టీఆర్పీస్) శాయంపేట మండల అధ్యక్షుడు సామల మధుసూదన్ అధ్యక్షతన మండల నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో పద్మశాలీల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహ ఏర్పాటుకు తన వంతుగా సహకరిస్తామని అన్నారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1లక్ష వరకు రుణమాఫీ చేసిందన్నారు. పద్మశాలీలు ఐక్యంగా ఉండి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణరావును పద్మశాలీలు శాలువాతో సత్కరించారు. చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడు వీరమోహన్, నాయకులు పద్మ, మల్లేశం, మల్లేశం, బాలరాజు, శ్రీనివాస్, నవీన్, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు నిర్వహించనున్న జాబ్ మేళాకు నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి సద్వినియోగం చేసుకోవాలని



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని 24 గ్రామాల్లో గల నిరుద్యోగులు తమ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని, చదువుకు తగిన ఉద్యోగం పొందాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉద్యోగం సాధించిన వారికి 4 నెలల పాటు శిక్షణ ఇచ్చి రూ.15వేల నుంచి రూ. 50వేల వరకు వేతనం ఉంటుందని, హాస్టల్, భోజన సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రభుత్వం

మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీశివ మార్కండేయ ఆలయంలో ఏకాదశ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు శుక్రవారం మూడో రోజు అంగరంగ వైభవంగా కొనసాగాయి. భద్రకాళి దేవస్థానం అర్చకుడు గణేశ్ ఆత్రేయ శర్మ, దుర్గాసాయి శర్మ, ప్రద్యుమ్న శర్మ, అచ్యుత్ శర్మ, సాయి ప్రణీత్ శర్మ, సాయి రాజేశ్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి, శ్రీపర్వత వర్ధిని సమేత శివ మార్కండేయ స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి, నాగదేవత విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలమంత్ర హవనం, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి కల్యాణ మహోత్సవాన్ని వేద మంత్రోచ్ఛరణాల నడుమ అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకంటి రాజ్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైకోర్టు న్యాయవాది మామిడి రూపేందర్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజేస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, బాసాని విశ్వప్రకాశ్, జయప్రకాశ్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మధుసూదన్, ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, తాటి రమేశ్, చిందం కర్ణాకర్, భక్తులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- కాజీపేట ఏసీపీ తిరుమల్



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ తిరుమల్

కమలాపూర్ : నేరాలు, చోరీల నియంత్రణ కోసమే గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్ అన్నారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో గ్రామస్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేరస్తుల గుర్తింపు, నిజ నిర్ధారణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అనేక నేర ఘటనల్లో సీసీ కెమెరాల ఆధారంగానే నేరస్తులను పట్టుకుని శిక్షించినట్లు తెలిపారు. ఉప్పల్‌లో రైల్వే స్టేషన్ ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చివెళ్లే ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుందని, ఇక్కడ ఎక్కువగా నేరాలు జరిగే ఆస్కారం ఉందని భావించి కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ముందుగా ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకొస్తే అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తామని, పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. వ్యాపారస్తులు కూడా తమ దుకాణాల ఎదుట తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ హరికృష్ణ, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ఆత్మకూరు : కొనుగోలు కేంద్రాన్ని శ్రీనివాస్‌రెడ్డి



దామెర : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ రూఫీ

ఆత్మకూరు : ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని పెంచికలపేట పీఏసీఎస్ చైర్మన్ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీరుకుళ్ల, హౌజుబుజుర్గు గ్రామాల్లో శుక్రవారం పెంచికలపేట సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది పనిచేయాలన్నారు. దళారులను రైతులు నమ్మొద్దని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, ఆత్మకూరు సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, ఉడుత రాజేందర్, సాంబమూర్తి పాల్గొన్నారు.

దామెర : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఏఎంసీ రూఫీ అన్నారు. మండలంలోని తక్కళ్లపహాడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. సన్నాలకు 500 బోనస్ ఇవ్వడంతో పాటు రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం వీఓ అధ్యక్షురాలు కొత్తపల్లి స్వప్న, పీఏసీ కమిటీ సభ్యులు కొత్తపెల్లి జయ, గోగు నర్సమ్మ, వీఓఏ సంధ్య, సీసీ శ్రీను, ఏఈఓ సోని, రైతులు ఇంద్రయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



ధర్మసాగర్ : రైతులకు భవిష్యత్ భరోసాగా ఆయిల్ పామ్ సాగు నిలుస్తోందని, ఆయిల్‌పామ్ తోటల సాగు అధిక లాభాలు ఇస్తుందని హార్టికల్చర్ డివిజన్ అధికారి సుష్మిత అన్నారు. మండలంలోని సాయిపేట గ్రామంలో ఉద్యాన శాఖ, కేఎన్ బయో సైన్సెస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతు కొండం భగవాన్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ క్షేత్రంలో శుక్రవారం రైతులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. భవిష్యత్‌లో ఆయిల్ పామ్ సాగు 100 శాతం భరోసా కల్పిస్తుందని అన్నారు. ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు, డ్రిప్పు ద్వారా ఎరువులు పంపే విధానాన్ని, వేసవిలో ఆయిల్ పామ్ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. 2025–26 సంవత్సరంలో సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. కేఎన్ బయో సైన్సెస్ జిల్లా మేనేజర్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంట టన్నుకు రూ. 21,000లతో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో, ఎల్కతుర్తి మండలంలోని బావుపేట్ గ్రామంలో ఆయిల్ పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలో ములుగులో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్ ,రైతులు సమ్మయ్య, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

కృష్ణకు శ్రీకాంతాచారి మెమోరియల్ అవార్డు



ఐనవోలు : తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి మెమోరియల్ అవార్డును మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన గబ్బెట కృష్ణ అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో నింగినేల మేము సైతం, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ చేతుల మీదుగా శుక్రవారం అవార్డు అందుకున్నట్లు కృష్ణ తెలిపారు. ఉద్యమానికి ఊపిరూదిన తన ఆటపాటలకు ఈ అవార్డు దక్కడం సంతోషమన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

- ట్రైనీ ఐపీఎస్ మనన్ భట్



మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ మనన్ భట్

దామెర : మానసికోల్లాసానికి క్రీడలు దోహద పడుతాయని ట్రైనీ ఐపీఎస్ మనన్ భట్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్–ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ ప్రెస్‌పై విజయం సాధించింది. ఈ సందర్భంగా ట్రైనీ ఐపీఎస్ మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్, ప్రెస్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించాలని అన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం పెంపొందించేందుకు ఉపయోగపడుతాయని అన్నారు. విధి నిర్వహణలో భాగంగా సురక్షితంగా ప్రయాణం కొనసాగాలని విలేకరులకు హెల్మెంట్లు పంపిణీ చేశారు. అనంతరం పరకాల ఏసీపీ సతీశ్ బాబు మట్లాడుతూ.. యువత క్రీడలపై ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాయంపేట సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్, శాయంపేట ఎస్సై పరమేశ్వర్, పోలీస్ సిబ్బంది, విలేకరులు, యువకులు పాల్గొన్నారు.

కూలీలకు ఎక్కువ పనిరోజులు కల్పించాలి

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆత్మకూరు : ఉపాధి కూలీలకు ఎక్కువ పనిరోజులు కల్పించాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆత్మకూరు, దామెర, శాయంపేట మండలాల ఈజీఎస్ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025–26 సంవత్సరం లక్ష్యాలపై చర్చించారు. తక్కువ ప్రగతి ఉన్న గ్రామాలకు క్షేత్రస్థాయికి వెళ్లి కూలీలకు అవగాహన కల్పించి ఉపాధి హామీ పనికి వచ్చే విధంగా చూడాలని అన్నారు. అలాగే రూ.307 కూలీ గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇచ్చి 5గంటలు పనిచేయించాలన్నారు. అలాగే గ్రామాల్లోని నర్సరీలలో మొక్కల సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీడీఓలు శ్రీనివాస్‌రెడ్డి, ఫణిచంద్ర, కల్పన, ఏపీఓలు రాజిరెడ్డి, శారద, ఈసీలు శ్రీధర్, రాము, రమేశ్, రాజేశ్, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1986–87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకుని అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అంతకు ముందు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కొంతమంది మిత్రులు, చదవు చెప్పిన గురువులు అనారోగ్య సమస్యలతో మృతిచెందంగా రెండు నిమిషాలు మౌనం పాటించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ నివాళులర్పించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. గ్రూప్ ఫొటోలు దిగారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం

కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేపట్టబోయే కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ నాయకులు అన్నారు. కులగణన చేయాలని కేంద్ర కేబినెట్‌లో ఆమోదించడంపై ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. శాయంపేట, కమలాపూర్, ఆత్మకూరు, వేలేరు, దామెర మండల కేంద్రాల్లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



శాయంపేట : స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



వేలేరులో..



దామెరలో..



ఆత్మకూరులో..

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

వర్ధన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఇల్లంద జెడ్పీ హైస్కూల్ వజ్రోత్సవ కమిటీ సభ్యులు మోడెం కుమారస్వామి, రాయపురం కుమారస్వామి తెలిపారు. మండలంలోని ఆ స్కూల్‌లో పదో తరగతిలో 540 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన దోర్నం వర్షితతోపాటు అత్యధిక మార్కులు సాధించిన మరో నలుగురు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను, హెచ్‌ఎం కృష్ణను స్కూల్ ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సభ్యులు మోడెం కుమారస్వామి, రాయపురం కుమారస్వామి మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధించారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు, కమిటీ సభ్యులు పెంచాల కుమారస్వామి, గుంటి కుమారస్వామి, కవిరాజు, నాగరాజు, జోగుల సంపత్, సట్ల చంద్రమౌళి పాల్గొన్నారు.